25 నుంచి 27 వరకు మద్యం దుకాణాలు బంద్

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొల్లూరు, ఆర్సీపురం పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడించారు. ఈ మేరకు శనివారం సీపీ ఉత్తర్వులు జారీచేశారు. మెదక్ – నిజామాబాద్ – అదీలాబాద్ – కరీంనగర్ నియోజకవర్గాల్లో జరగనున్న గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఓటర్లను మభ్యపెట్టకుండా ఈ నెల 25 సాయంత్రం 4 గంటల నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు కొల్లూరు, ఆర్సీపురం ఠాణాల పరిధిలో కల్లు కంపౌండ్‌లు, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ ఠాణా పరిధిలోని క్లబ్బులు, పబ్బులు, స్టార్ హోటల్స్‌ల్లో సైతం మద్యం అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆంక్షలు అమల్లో ఉన్న సమయంలో ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు, మద్యం సరఫరాకు పాల్పడితే చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

బ్లాక్ ఫిల్మ్‌లు వాడొద్దు.. మల్టీటోన్ హారన్స్ వద్దు

- ట్రాఫిక్ పోలీసులకు వ్యాపారులు, మెకానిక్‌లు సహకరించాలి..
- నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి
- మోటార్ వెహికల్ చట్టంపై వ్యాపారులకు అవగాహన
- ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించే సమయంలో అన్ని చట్టపరమైన నిబంధనలు పాటించాలని, తమ వద్దకు వచ్చే కస్టమర్లకు అవగాహన కల్పిస్తూ చేసిన పనికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు మెయింటెన్ చేసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ అన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బ్లాక్‌ఫిల్మ్‌లు, సైరన్‌లు, మ్యూజికల్ అండ్ మల్టీటోన్ హారన్‌లు, మోడిఫైడ్ సైలెన్సర్లు, నంబర్‌ప్లేట్లు, వాహనాల మార్పులకు సంబంధించి సంబంధిత కార్ డెకార్స్, మెకానిక్స్, రేడియం డిజైనర్స్ తదితర వ్యాపారులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వప్రసాద్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ట్రాఫిక్ రూల్స్‌కు అనుగుణంగా మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వ్యాపారులు ట్రాఫిక్ విభాగానికి సహకరించాలని చెప్పారు. బ్లాక్ ఫిల్మ్‌లను నిషేధించారని, వాహన తయారీదారులు బ్లాక్ ఫిల్మ్‌లు వేసే క్రమంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. మల్టీ టోన్ హారన్‌లను ఇన్‌స్టాల్ చేయకూడదని, నంబర్ ప్లేట్లను కూడా వాహన చట్టం ప్రకారమే ఆంగ్ల అక్షరాలు, అరబిక్ అంకెలను ప్రదర్శించాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని, వాహనదారుల భద్రత తమ లక్ష్యమని, ఇందుకు అందరూ సహకరించాలని విశ్వప్రసాద్ తెలిపారు. సమావేశంలో భాగంగా వ్యాపారులు, మెకానిక్‌లకు మోటార్ వాహనచట్టం ఇతర అంశాలకు సంబంధించిన నిబంధనలపై ప్రశ్నోత్తరాల సెషన్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు రాహుల్‌హెగ్డే, అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, హైదరాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, కార్ డెకార్స్, ఆటోమొబైల్ షాపులు, ఆటోమొబైల్ వర్క్‌షాపులు, రిజిస్ట్రేషన్ నంబర్‌ప్లేట్ల తయారీదారులు పాల్గొన్నారు.

ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్లకు బిల్డ్ నౌ డీసీఆర్ పై శిక్షణ

టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్ రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ కోసం ఏఐ సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్ అమలుకు బిల్డ్ నౌ కార్యక్రమాన్ని ప్రారంభించిందని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్ రెడ్డి తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం బిల్డ్ నౌ డీసీఆర్‌పై లైసెన్స్ కలిగిన ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్‌లకు హ్యాండ్స్ ఆన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటిని సిస్టం ద్వారా భవన నిర్మాణ అనుమతుల పరిశీలన వేగవంతం అవుతుందని చెప్పారు. బిల్డ్ నౌ అప్లికేషన్ ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గించే అధునాతన సాంకేతికత గల వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూటిని సిస్టంలో ఒకటిగా దీన్ని రూపొందించారని చెప్పారు. బిల్డ్ నౌ డీసీఆర్ వ్యవస్థపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడంతో పాటు భవన అనుమతుల ప్రక్రియలో క్రియేషన్ ఆఫ్ టెంప్లేట్స్, లేయర్లు, వివిధ ఎంటిటీలను రూపొందించడం గురించి అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా తలెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం, చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఫాస్ట్ డ్రాయింగ్, స్క్రూటిని సిస్టం కోసం ఏఐ ద్వారా భవన నిర్మాణ అనుమతులు వేగవంతంగా పూర్తవుతాయని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అడిషనల్ సీసీపీలు, సీపీలు, ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్ లు, బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసులుకు జాతీయ అవార్డు

డాక్టర్ మిలింద్ నికుబ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు

రామంతపూర్, ఫిబ్రవరి 22: రామంతాపూర్ ప్రభుత్వ హోమియో మెడికల్ కాలేజీ ప్రొఫెసరు గదడుగు శ్రీనివాసులు డాక్టర్ జీఏల్‌ఎన్ శాస్త్రి స్మారక జాతీయ అవార్డును అందుకున్నారు. పూణేలో 27వ జాతీయ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి రెండు రోజుల సదస్సుకు శనివారం ఆయన కలశాల నుంచి వెళ్లారు. ఈ సదస్సుల్లో జీవన శైలి వ్యాధులు, మాతా శిశు ఆరోగ్య అంశాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు హోమియో విశిష్టత వంటి అంశాలపై 60 మంది ప్రొఫెసర్లు వారి శాస్త్రీయ పత్రాలను సమర్పిస్తున్నారు. ప్రముఖ హోమియో వైద్యులు మెదడు వాపు వ్యాధి హోమియో నివారణ మందులను కనిపెట్టిన డాక్టర్ జీఎల్‌ఎన్ శాస్త్రి గారి మెమోరియల్ జాతీయ అవార్డును జేఎస్‌పీఎస్ హోమియో వైద్య కళాశాల పీజీ ప్రొ. శ్రీనివాసులుకు ప్రదానం చేశారు. ఆయన హోమియో వైద్యానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్టు తెలిపారు. డాక్టర్ శ్రీనివాసులు 34 ఏళ్ల ఆయుష్ డిపార్ట్మెంట్ తన సేవల ను వివిధ స్థాయిలలో హోమియో వైద్య విద్య, పరిశోధనలు, వివిధ రకాల వ్యాధుల చికిత్సకు తన సేవలను అందించారు. వైరల్ ఇన్ఫెక్షన్‌లో ప్రధానంగా జపనీస్ (మెదడు వాపు వ్యాధి)లో హోమియో మందులు పని తీరును అత్యాధునిక లేబరేటరీలో పరిశోధనల ద్వారా నిరూపించారు. వీరి పరిశోధన పత్రాలు అమెరికన్, ఇటాలియన్, బ్రిటీష్ జర్నల్స్‌లో ప్రచురించబడినవి. గతంలో వీరికి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును 2004 రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చారు.

వీరి విద్యార్థులు అత్యున్నత పదవులలో..

హోమియో వైద్యానికి నాలుగు దశాబ్దాల పాటు చేసిన విశిష్ట సేవలకు జాతీయ అవార్డును డాక్టర్ శ్రీనివాసులుకు మహారాష్ట్ర హెల్త్ యూనివర్సిటీ సైన్స్ డిపార్ట్‌మెంట్ వీసీ డాక్టర్ మిలింద్ నీకుబ్ చేతుల మీదుగా పూణె సదస్సులో అందుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 1200 మంది హోమియో వైద్యులు ఈ జాతీయ సదస్సులో పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 50 మంది డాక్టర్లు సదస్సుకు హాజరు అయినట్లు ఆయన తెలిపారు.

కలెక్టర్‌కు నిర్మాణ పత్రాలు అందజేస్తున్న టీసీఎస్ ప్రతినిధులు

విద్యార్థుల భవితకు టాటా తోడ్పాటు అభినందనీయం

టీసీఎస్ ఆధ్వర్యంలో సుల్తాన్ బజార్‌లో పాఠశాల భవన నిర్మాణం

ప్రతినిధులతో కలిసి భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా టాటా సంస్థ పాఠశాల భవనాలు నిర్మించడం అభినందనీయమని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సుల్తాన్ బజార్‌లో నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని శనివారం టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, క్లస్టర్ హెడ్ శ్రీరంగ్ దావ్లేతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, టాటా సంస్థ నగరంలో పాఠశాల భవనాలు నిర్మించి అందించడం అభినందనీయమని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సుల్తాన్ బజార్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్, మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, అంజయ్య, మాజీ ఎంపీ కేశవరావుతో పాటు పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, ఉన్నతాధికారులు చదువుకున్న చరిత్ర ఉన్నదన్నారు. టాటా సంస్థ పాఠశాల నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా రెండంతస్తుల్లో గదులతో పాటు సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, బాల, బాలికల డైనింగ్ హాల్స్, కాన్ఫరెన్స్ హాల్, మౌలిక సదుపాయాలు కల్పించి అద్భుతంగా చేపట్టడం సంతోషదాయకమని కొనియాడారు. టాటా సంస్థ దేశాన్ని ఐటీ, పారిశ్రామిక రంగాల్లో సేవందిస్తుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. అనంతరం, టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న మాట్లాడుతూ, పాఠశాల భవన నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలతో చేపట్టామని తెలిపారు. పేద పిల్లల విద్యా వికాసంలో టాటా సంస్థ ముందుంటుందని వెల్లడించారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కేసీఆర్‌పై దుష్ప్రచారం తగదు

దుష్ప్రచారకులపై ఫిర్యాదు

సెంట్రల్ సైబర్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ప్రదీప్ రాజ్ కోటి శైలేష్ కురుమ తదితరులు

అబిడ్స్ ఫిబ్రవరి 22: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పైన దుష్ప్రచారం చేయడంతో పాటు తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై బీఆర్ఎస్ పార్టీ నాయకులు సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా పలు వార్తా పత్రికల పేరిట దుష్ప్రచారం చేస్తున్న సతీశ్ మన్నె, సుప్రియా శ్రీనేట్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఐటీ సెల్ స్టేట్ హెడ్), ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు సెంట్రల్ సైబర్ క్రైమ్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ గోషామహల్ నాయకులు కోటి శైలేశ్, అనిల్ కుమార్, ప్రదీప్ రాజ్ తదితరులు ఉన్నారు.

ఎల్ ఓసీ అందజేత

ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 22 : పట్టణ పరిధిలోని సామల సుగుణమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. నిమ్స్‌లో వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, 13వ వార్డు అధ్యక్షుడు గుండు ఉప్పలయ్య పాల్గొన్నారు.

'రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి'


రజకులకు సభ్యత్వం అందజేస్తున్న ఉప్పలయ్య

రామన్నపేట, ఫిబ్రవరి 22 : రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పొన్న ఉప్పలయ్య అన్నారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో శనివారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో రజక వృత్తిదారులు సిరిసనగండ్ల నర్సింహ, పిచ్చయ్య, పద్మ, నర్సమ్మ, వంశీ, ఏలేందర్, ఆండాలు, సాయమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ సమీపంలో చేలరేగిన మంటలు

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని కొల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం మంటలు చేలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు దగ్గరలో ఉన్న ఓ వెంచర్ నుంచి మంటలు వ్యాపించి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చాయిన, సబ్‌స్టేషన్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఏఈ మిట్ట వెంకట్‌గౌడ్ తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధం

మోత్కూరు, ఫిబ్రవరి 22 : మున్సిపాలిటీ కేంద్రంలో ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్‌కు నిప్పంటుకొని గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడేనికి చెందిన రైతు వెంగళ ఉపేందర్‌రెడ్డి గడ్డిని కొనుగోలు చేసి శనివారం ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని జ్యోతీరావు పూలే విగ్రహం సమీపంలో మూల మలుపులో విద్యుత్ వైర్లు తగిలి మంటలు అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ హైడ్రాలిక్ ఎత్తి ట్రాలీని పైకి లేపడంతో గడ్డి కట్టలు కింద పడి కాలిపోయాయి. దాంతో రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

వీధిలైట్లకు ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు


కప్రాయపల్లిలో వీధి లైట్ల కోసం ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 22 : మండలంలోని కప్రాయపల్లిలో 'కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్' శీర్షికతో శనివారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వీధి లైట్లకు గ్రామపంచాయతీ ఉద్యోగులు ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్ బహూకరణ

రాజాపేట, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన కాకల్ల నవీన్‌కుమార్ శనివారం మైక్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి నవీన్‌కుమార్‌కు అభినందలు తెలిపారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా : డీఈఈ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 : జిల్లా వ్యాప్తంగా ఎలాంటి విద్యుత్ కోతలు లేవని, నిరంతరాయంగా సరఫరా జరుగుతుందని డీఈఈ ఎస్.వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఓవర్‌లోడ్ సమస్యలున్న చోట అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్నా కంట్రోల్ రూమ్ నంబర్ 9491065938లో సంప్రదించాలని సూచించారు.

నేడు గురుకులాల ప్రవేశ పరీక్ష

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 : సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత పరీక్షను గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సి.జగదీశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని, హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, పెన్నులు (బ్లూ, బ్లాక్), ప్యాడ్ తెచ్చుకోవాలని సూచించారు.

'సకాలంలో పన్నులు చెల్లించాలి'

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 22 : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అంజన్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనున్నదని తెలిపారు. మొత్తం పన్నులు రూ.2.12 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 40 శాతం (రూ.83.35 లక్షలు) మాత్రమే వసూలైందని పేర్కొన్నారు. ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సంబంధిత వార్డు అధికారి, బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్లలో చెల్లించి రసీదు పొందాలని సూచించారు. సెలవు రోజుల్లోనూ అన్ని పన్నులు స్వీకరించబడునని తెలిపారు.

నేడు టీజీసెట్ పరీక్ష

చౌటుప్పల్, ఫిబ్రవరి 22 : పట్టణంలోని బంగారిగడ్డ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం టీజీసెట్–2025 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కొండూరు సరోజమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 192 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తప్పని సరిగా ఆధార్ కార్డు, హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను తీసుకొని రావాలని సూచించారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల జన్మదిన వేడుకలు

యాదగిరిగుట్ట : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్/ యాదగిరిగుట్ట/ భువనగిరి అర్బన్/ భూదాన్ పోచంపల్లి/ వలిగొండ, ఫిబ్రవరి 22 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను చింతల యువసేన ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రాయగిరి కమాన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసిన భారీ గజమాలతో చింతలకు స్వాగతం పలికారు. అనంతరం అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. భువనగిరి పట్టణంలోని ఏరియా దవాఖానలో చింతల అభిమానులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చింతల వేంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. భూదాన్ పోచంపల్లిలో చింతల యువసేన ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. వలిగొండ మండలంలోని టేకులసోమారం గ్రామంలో సాధన మానసిక వికలాంగుల ఆశ్రమంలో చింతల అభిమానులు కేక్ కట్ చేసి వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు.

క్రిప్టో కరెన్సీ పేర రూ.8.5 లక్షల టోకరా

నిందితుడి అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీ వ్యాపారులను మోసం చేసి తద్వారా సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేసి పలువురి దగ్గర డబ్బులు కొట్టేసిన బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు రామకృష్ణారెడ్డిని సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఒక బాధితుడు తాను రూ.8.5 లక్షలను మోసపోయానంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు సదరు నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడు రామకృష్ణారెడ్డి తన కంపెనీ ద్వారా క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ నిర్వాహకులు క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేసేలా పథకం వేస్తాడు. ఆ తర్వాత కొనుగోలు చేసిన సమయంలో నిర్వహణ పేరుతో కస్టమర్ మొత్తం ఫండ్స్‌ను తాను తీసుకుని బ్యాలెన్స్ జీరోగా చూపిస్తాడు. కస్టమర్ వారిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తే రెస్పాండ్ కావడం లేదంటూ పోలీసులను బాధితుడు సంప్రదించగా, సైబర్ బృందం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.సతీశ్ రెడ్డి, ఎస్ఐ పృథ్వీరాజు, పీసీఎస్ గోవిందరావు, శివశంకర్‌లు నిందితుడిని పట్టుకుని ఒక యాపిల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్రిప్టో కరెన్సీ మోసాలను అరికట్టాలంటే థర్డ్ పార్టీ యాప్‌లను వాడకుండా నిజమైన యాప్‌లను వాడాలని, మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

యూరోప్ టూర్.. మోసం

ట్రావెల్స్ సంస్థ డైరెక్టర్‌పై చీటింగ్ కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22: యూరోప్ టూర్ తీసుకెళ్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ట్రావెల్స్ సంస్థ డైరెక్టర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.., కాప్రాలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి అనే వ్యక్తి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సంస్థలో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తుంటారు. 2019లో బంజారాహిల్స్ రోడ్ నం.10లోని స్టార్ ఆస్పత్రి పక్కనున్న మంత్రా హాలిడేస్ సంస్థకు వచ్చిన విష్ణువర్ధన్ రెడ్డికి సంస్థ డైరెక్టర్ శివప్రసాద్ రెడ్డి పరిచయమయ్యాడు. తమ సంస్థ నుంచి అనేక మందిని తక్కువ వ్యయంతో వరల్డ్ టూర్ తీసుకువెళ్లామని నమ్మబలికాడు. దీంతో తనతో పాటు తన కోలీగ్ వెంకట నారాయణతో కలిసి యూరోప్ టూర్ కోసం రూ.60 వేల చొప్పున చెల్లించాడు. కాగా, కొవిడ్ కారణంగా మూడేళ్ల పాటు టూర్ తీసుకువెళ్లడం కుదరలేదు. కాగా, 2023లో శివప్రసాద్ రెడ్డి గతంలో చెప్పిన టూర్‌కు బదులుగా మాల్దీవులు, దుబాయి దేశాలకు తీసుకువెళ్లానంటూ చెప్పారు. అయితే, ఏడాదిన్నర గడిచినా టూర్ మాట ఎత్తకపోవడంతో పాటు ఫోన్లు పనిచేయకపోవడంతో అనుమానం వచ్చి ఇటీవల పరిశీలించగా, ఆఫీస్ ఖాళీ చేసినట్లు తేలింది. తమను మోసం చేసిన శివప్రసాద్ రెడ్డి మీద చర్యలు తీసుకోవాలంటూ విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పో లీసులు ఐపీసీ 420, 408 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేతబడి చేపిస్తున్నాడని.. హత్య

కొండాపూర్, ఫిబ్రవరి 22: చేతబడి చేపిస్తున్నాడన్న నెపంతో స్నేహితులే వ్యక్తిని కొట్టి చంపిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపిన ప్రకారం, నెహ్రూనగర్ లో ఉంటున్న నసీరుద్దీన్ చేతబడి చేపిస్తున్నాడన్న అనుమానంతో అదే కాలనీలో ఉండే స్నేహితుడు ఫక్రుద్దీన్ శుక్రవారం రాత్రి మాట్లాడేది ఉందని ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లాడు. అప్పటికే గోపీ చెరువు వద్ద ఉన్న మరో ముగ్గురు స్నేహితులతో కలిసి మద్యం సేవించారు. చేతబడి విషయమై మాట్లాడుతూ, నసీరుద్దీన్ ను భయపెట్టేందుకు కర్రతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నసీరుద్దీన్ స్పృహ కోల్పోయాడు. చికిత్స నిమిత్తం నసీరుద్దీన్ ను చందానగర్లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకు వెళ్లారు. కాగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నసీరుద్దీన్ ఒంటిపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు ఫక్రుద్దీన్ తో పాటు అతని స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్టులో ఇరుక్కొని బాలుడి మృతి

మెహిదీపట్నం, ఫిబ్రవరి 22: లిఫ్ట్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదేండ్ల బాలుడు అర్ణవ్ శనివారం నిలోఫర్ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం మాసబ్ ట్యాంక్ శాంతినగర్‌లోని మఫర్ కంఫర్టెక్ అపార్టుమెంటులో లిఫ్ట్‌కు, గోడకు మధ్యలో అర్ణవ్ ఇరుక్కున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి బాలుడిని బయటకు తీశారు. గాయాలకు గురైన బాలుడిని చికిత్స కోసం నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. పిల్లాడి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్కూల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

ఉప్పల్, ఫిబ్రవరి 22: స్కూల్ భవనం పై నుంచి దూకి ఓ విద్యార్థి సూసైడ్ చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల ప్రకారం, బోడుప్పల్ ద్వారకానగర్ కు చెందిన ధర్మారెడ్డి, సంగీత దంపతుల రెండో కుమారుడు సంగారెడ్డి ఉప్పల్ న్యూ భారత్ నగర్ లోని సాగర్ గ్రామర్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయం తరగతి గదిలో ఉపాధ్యాయుడు మందలించడంతో మనస్తాపానికి గురై క్లాస్ టీచర్‌కు వాష్‌రూమ్ కి వెళ్లొస్తానని చెప్పి నాలుగు అంతస్తుల బిల్డింగ్‌పై నుంచి దూకి సూసైడ్ చేసుకున్నాడు. వెంటనే స్కూల్ నిర్వాహకులు దగ్గర్లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చనిపోయాడని నిర్ధారణ చేశారు. మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు స్కూలుకు చేరుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ నిరసన

రామంతాపూర్, ఫిబ్రవరి 22: ఉప్పల్‌లోని సాగర్ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థి పీటీ టీచర్ వేధింపులకు గురై భవనం పై నుంచి దూకి ఆత్మ హత్య చేసుకోవడ పట్ల ఎస్ఎఫ్ఐ నాయకులు స్కూల్ ముందు శనివారం నిరసన చేపట్టారు. విద్యార్థిని నిరంతరం వేధించడం, హాల్ టికెట్ ఇవ్వకుండా ఆపేయడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురై భవనంపై నుంచి దూకాడన్నారు. దీనికి స్కూల్ మేనేజ్‌మెంట్ బాధ్యత వహించాలన్నారు. స్కూల్ అనుమతి రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై డీఈఓ, ఎం ఈఓ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎఫ్ఐ నాయకులు శ్యామ్ రావు, సభ్యులు శ్రీమాన్, రాజేశ్, అరుణ్, ప్రశాంత్ రాకేశ్, ఆకాశ్, శేఖర్, శ్యామ్ పాల్గొన్నారు.

బిజినెస్ పేరుతో రూ.4.5 కోట్ల మోసం

సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): బిజినెస్ చేద్దామంటూ మాయమాటలు చెప్పి నమ్మించి విడతల వారీగా రూ.4.5 కోట్లు తన వద్ద నుంచి తీసుకున్న కాంతి దత్ అనే వ్యక్తిపై జూబ్లీహిల్స్‌కు చెందిన జూపల్లి సౌజన్య అనే మహిళ చేసిన ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. తనను నమ్మించి వివిధ సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ కాంతిదత్ డబ్బులు తీసుకున్నాడని, శ్రీ స్మైరా హాస్పిటాలిటీ పేరుతో సంస్థను ప్రారంభించి తనను పార్ట్‌నర్‌గా చేసుకున్నట్లు చెప్పి బిజినెస్ చేశాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, వివిధ చోట్ల బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్లు చెప్పడం, డబ్బులు తీసుకోవడం, వీటితో పాటు ఆర్నమెంట్స్, హోటల్స్‌లో కూడా వివిధ రకాల పెట్టుబడులు పెట్టించాడని ఆమె పేర్కొన్నారు. అయితే, తాను నిజం తెలుసుకునే సమయానికి అసలు బిజినెస్ లేదని, చాలా చిన్నగా వ్యాపారాలు నడుపుతూ అందరినీ మోసం చేస్తున్నట్లు గ్రహించానని సౌజన్య పేర్కొన్నారు. కాగా, కాంతి దత్‌కు క్రిమినల్ చరిత్ర ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.